అయ్యాలు ఎందుకు రాశావ్రా, బాబూ!' అను కున్నాడు సుబ్బారావు. అంతలో ఆఫీసరుగారు పిలుస్తున్నారంటూ ప్యూన్ వచ్చాడు సుబ్బారావు దగ్గరకు. గుండెలో రాయి పడింది అతనికి. బిక్కుబిక్కుమంటూ ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు. అతణ్ణి చూడగానే ఆఫీసర్ కారాలూ, మిరియాలూ నూరాడు.

"ఆ బడ్జెట్ ఫైలు ఇంకా ఎన్నాళ్ళు నీ దగ్గర పెట్టుకుంటావు? అసలు ఆఫీసులో నువ్వు ఏం పని చేస్తున్నట్టు? ఇలా అయితే..." అంటూ ఆగిపోయాడు ఆఫీసర్. గదంతా ఒక్కసారి కలయ చూశాడు.

"ఏమిటది? ఏదో వాసన వస్తూంది? నీ దగ్గరి నుంచేనా? అసలు నువ్వు స్నానం చేసి ఎన్నాళ్ళయింది? నీళ్ళు కరువుగా ఉందని స్నానం మానుకున్నావా? అంత చెడ్డ వాసన భరిస్తూ ఎలా ఉండగలుగుతున్నావయ్యా?" అంటూ సుబ్బారావు మీద విరుచుకు పడ్డాడు.

సుబ్బారావు భయంతో వణికాడు. "అది కాదు, సార్."

"ఏమిటి కానిది?" అన్నాడు ఆఫీసర్.

"అదే సార్, అదే—హెయిర్ ఆయిల్..."

"హెయిర్ ఆయిల్ ఏమిటి?" విసుక్కున్నాడు బాస్.

"హెయిర్ ఆయిల్, సార్... వెంట్రుకలు—తల—వూడిపోతాయంటే..."

"ఏమిటా అర్థంకాని మాటలు? చెప్పేదేదో నీళ్ళు నమలకుండా చెప్పు."

నసి నసి చెప్పాడు సుబ్బారావు, ప్రాణాలు ఉగ్గబట్టుకుని. అతను చెప్పింది విని ఆఫీసరు నవ్వేశాడు.

"ఎన్నెన్నో నూనెలా తలకు రాస్తే, కొంద రకానికే నీకు గుండె పోతుంది. ఇంకెప్పుడూ వాటిని రాయకు" అని హెచ్చరించాడు బాస్.

"ఎస్, సార్! అలాగే, సార్!"

"చూడు, సుబ్బారావ్! నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఏ మనిషి అయినా ఏ రోజు వారీ కార్యక్రమాల్లో శరీరానికి ఎంతో ఇంతో శ్రమ ఇస్తూనే ఉంటాడు. ఏ భాగాలు కదిలిస్తా అందని చోటు మనిషి తల ఒక్కటే. అందువల్ల తలకు సరి అయిన రక్త ప్రసారం అందదు. కనుకనే తల మీది వెంట్రుకల కుదుళ్ళు బలహీనమై పోతాయి. అందువల్లనే క్రమేపీ వెంట్రుకలు రాలి పోతాయి. కొన్నాళ్ళకు బట్ట తల వచ్చేస్తుంది" అన్నాడు బాస్ గంభీరంగా.

సుబ్బారావు విసుగు మొహం పెట్టాడు.

"విచారపడకు, సుబ్బారావు దీని కొక చక్కని మార్గముంది. శీర్షాసనం! శీర్షాసనం వేశావంటే




# సుబ్బారావు బట్టతల

— కాడిమెల శ్రీరామమూర్తి

వీ బాధ తీరిపోతుంది. శీర్షాసనం వల్ల వెంట్రుకల కుదుళ్ళకు ఎక్కడలేని బలం వచ్చేస్తుంది. అప్పుడిక వెంట్రుకలు వూడమన్నా వూడవు'' అంటూ ధైర్యం చెప్పాడు బాస్.

అది విని ఏనుగు ఎక్కినంత పని అయింది సుబ్బారావుకు.

"శీర్షాసనం వెయ్యడం ఎలా, సార్?'' అన్నాడు.

"నీకు పరబ్రహ్మశాస్త్రి తెలుసా?''

"ఎవరు, సార్, ఆయన?''

"ఓరి నీ ఇల్లు బంగారంగానూ! అతన్నే ఎరగవా? ఆసనాల స్పెషలిస్టు అయ్యా అతను! గొప్ప గొప్ప వాళ్ళందరి చేతా అతనే ఆసనాలు వేయిస్తూంటాడు. గడియారం స్తంభం వద్ద అతని ఇల్లు. నేను ఉత్తరం ఇస్తాను కానీ, వెళ్ళి అతణ్ణి కలుసుకో. శీర్షాసనం ఎలా వెయ్యాలో అతను చెపుతాడు. అతను అడిగినంతా ఇయ్యి! నీకు బట్టతల రాకుండా అతను చూసుకుంటాడు'' అన్నాడు. సుబ్బారావుకు ఒక ఉత్తరం కూడా వ్రాసి ఇచ్చాడు. ఆఫీసు టైమ్ అయిన తరవాత పరబ్రహ్మ శాస్త్రి ఇల్లు వెదుక్కుంటూ గడియారం స్తంభం వద్దకు వెళ్ళాడు సుబ్బారావు. ఆ ఇల్లు తేలికగానే దొరికింది అతనికి.

"పరబ్రహ్మ శాస్త్రిగారు ఉన్నారా?'' అని అడిగాడు, ఇంట్లోకి వెళ్ళి వెళ్ళగానే తనకు ఎదురైన ఒక శాల్తీని. ఆ శాల్తీ కండలు తిరిగిన పహిల్వాన్‌లా ఉన్నాడు.

"నేనే శాస్త్రిని! ఇంతకూ మీరెవరు?'' అన్నాడు ఆ శాల్తీ. సుబ్బారావు శాస్త్రికి ఉత్తరం ఇచ్చాడు.

"రండి. కూర్చోండి'' అంటూ మర్యాదచేసి ఒక కుర్చీ చూపాడు శాస్త్రి.

"సుబ్బారావ్ గారూ! పూర్వకాలంలోని ఋషీశ్వరులు, మునీశ్వరులను గురించి మీరు విన్నారుగదా? బొమ్మలు కూడా చూసి ఉంటారు. వాళ్ళెవరికైనా బట్టతల ఉండడం మీరు చూశారా? విన్నారా? అని అడిగాడు శాస్త్రి. సుబ్బారావు ఆలోచించాడు. అవును. ఋషులకు, మహా ఋషులకు బట్టతలలు లేనేలేవు. వాళ్ళెంత అదృష్టవంతులు! చక్కగా బోలెడ జుట్టు. శిఖరాలు శిఖరాలుగా లుంగ చుడతారు గోపురాలాగా నిలబెడతారు! ఆహా!

"అవును, సార్. ఋషీశ్వరు లెవరికీ బట్టతలలు లేవు—కుప్పలు కుప్పలుగా జుట్టుటవ్వ'' అన్నాడు సుబ్బారావు.

"ఒప్పుకున్నావు కదా? దానికి కారణమేమిటో తెలుసా? శీర్షాసనం! దానివల్లనే వాళ్ళ కా జుట్టు!''

అది విని సుబ్బారావుకు చాలా సంతోషమైంది. "అయితే, నేనూ శీర్షాసనం వేస్తాను, సార్'' అన్నాడు ఉత్సాహంగా.

"మంచిది అలాగే కానివ్వు. రేపటినుంచీ ఉదయం పూట మీ ఇంటికి వచ్చి నీకు నేర్పుతాను'' శాస్త్రి అన్నాడు.

"సార్! మీ ఫీజు?''

"నెలకు రెండు వందలు. మూడు నెలల్లో పాఠాలు పూర్తి అవుతాయి. నీ తలమీద కొత్త వెంట్రుకలు చిగురిస్తాయి!''

ఆ మరునాడు ఉదయం పరబ్రహ్మశాస్త్రి సుబ్బారావు ఇంటికి వెళ్ళాడు. శీర్షాసనం ఎలా వెయ్యాలో చెప్పాడు సుబ్బారావుకు. అతను చెప్పిన విధంగా తల నేలమీద ఆనించి, కాళ్ళు పైకి ఎత్తాడు సుబ్బారావు. మరు నిమిషంలో దొల్లు పుచ్చకాయలా క్రింద పడిపోయాడు. నడుముకూ, మోకాళ్ళకూ బలంగా దెబ్బలు తగిలాయి. శాస్త్రి ఒక్క చేతో అతణ్ణి లేపి కూర్చోపెట్టాడు.

"సుబ్బారావ్! గది మధ్యన కాదు నువ్వు ఆసనం వెయ్యవలసింది. గోడకు ఆనుకుని వెయ్యాలి. అప్పుడు నువ్వు పడవు!'' అన్నాడు శాస్త్రి, దెబ్బలు తగిలి మూలుగుతున్న సుబ్బారావుతో.

"ఆ మాట ముందే చెప్పకపోయారా?'' అన్నాడు వచ్చే కోపాన్ని దిగమింగుకుంటూ సుబ్బారావు.

చిరునవ్వు నవ్వుకుంటూ సుబ్బారావు వద్ద అడ్వాన్స్ తీసుకుని శాస్త్రి వెళ్ళిపోయాడు. ఆ విధంగా మూడు నెలలపాటు శాస్త్రి వద్ద ప్రయివేటు చెప్పించుకున్నాడు సుబ్బారావు. పర్యవసానం ఏమిటంటే, సుబ్బారావుకు ఆరు వందలు వదిలిపోయాయి. నెత్తిమీది వెంట్రుకలు వెనకటికన్నా మరింతగా రాల సాగాయి. తలమీద అటూ, ఇటూ బట్టతల తొంగి చూడడం మొదలు అయింది.

ఒక రోజున కోపంతో కడుపు మండిన సుబ్బారావు పరబ్రహ్మ శాస్త్రికి ఉద్వాసన చెప్పాడు.

"అనేటుడకు, సుబ్బారావ్! నెహ్రూజీ, కృశ్చేవ్, చౌ ఎన్ లై, శాంతారాం వంటి మహానుభావులు కూడా...''

"వాళ్ళు వేస్తే వేశారు. ఇక నేను మాత్రం వెయ్యను'' బిగ్గరగా అరిచాడు సుబ్బారావు. పరబ్రహ్మశాస్త్రి నోరెత్తకుండా ఇంటికి వెళ్ళిపోయాడు.

ఇప్పటికీ సుబ్బారావు మందులకూ మాకులకూ డబ్బు ఖర్చు పెడుతూనే ఉన్నాడు. బట్టతలమీద వెంట్రుకలు మొలిపించడానికి యజ్ఞాలూ, యాగాలూ, జపాలూ, తపాలూ చేయిస్తూనే ఉన్నాడు. అందువల అతని బట్టతల రోజు రోజుకూ మెరిసిపోతూనే ఉంది! *




అందియ రవళులు ఘల్లని మ్రోయగ ....

చిత్రం— జి. సుజాత (సికిందరాబాద్—3